# 2

# క్రీస్తు: దేవుని కుమారుడు

“మీరైతే నేను ఎవడనని చెప్పుకొనుచున్నారు?” అని యేసు తన శిష్యులను ప్రశ్నించినప్పుడు పేతురు, “నీవు క్రీస్తువు, సజీవుడగు దేవుని కుమారుడవు” అని ప్రత్యుత్తరమిచ్చాడు (మత్తయి 16:15, 16). యేసు క్రీస్తును గూర్చిన అత్యంత ప్రాముఖ్యమైన వాస్తవాన్ని పేతురు తన మాటల్లో తెలియజెప్పుచుండెను: యేసు, దైవికమైన దేవుని కుమారుడై యుండెను, మరియు అయియున్నాడు! ఆయన దైవము, శరీరధారియైన దేవుడు, అయియుండెను, మరియు అయియున్నాడు!

మనము “యేసు క్రీస్తును, అనగా సిలువవేయబడిన క్రీస్తు” ప్రకటించినప్పుడు, పేతురు ఒప్పుకొనిన ఈ గొప్ప సత్యమును మొదట మనము నమ్మవలెను ఆ తరువాత దానిని ఇతరులకు బోధింపవలెను. ఎందుకని? మనము పేతురు ఒప్పుకొనిన దానిలో గల సత్యమును ప్రకటించవలసి యున్నది ఏలయనగా క్రీస్తు దేవుని కుమారుడని క్రొత్త నిబంధనలోని సువార్తికులు ప్రకటించారు. పెంతెకొస్తు పండుగ దినాన, యేసును దేవుడు “ప్రభువుగాను క్రీస్తుగాను నియమించాడు” అని పేతురు ఘోషించాడు (అపొస్తులుల కార్యములు 2:36). యేసును “ప్రభువు” అని పిలుచుట ఆయన దైవత్వమును అంగీకరించుటయే. అతడు యేసు క్రీస్తును అంగీకరించిన వెనువెంటనే, సౌలు (పౌలు) “సమాజమందిరములలో, ‘యేసే దేవుని కుమారుడని’ ” ఆయనను గూర్చి ప్రకటించుటకు ప్రారంభించాడు (అపొస్తులుల కార్యములు 9:20).

### క్రైస్తవత్వములో అత్యంత ప్రాముఖ్యమైన వాస్తవము

యేసు క్రీస్తు వాస్తవికముగా ఈ పుడమిపై దేవుని కుమారుని వలె జీవించియుండినట్లయితే, ఆయన గూర్చి బైబిలు చెప్పుచున్న మిగిలినదంతా సత్యమై యున్నది. వాస్తవమునకు, క్రీస్తు దేవుని కుమారుడైయుండినట్లయితే, బైబిలులోని మిగిలినంతా సత్యమై యున్నది! యేసు దేవుని కుమారుడై యున్నాడు, మరియు అయియుండెనను వాగ్దానము బైబిలులోని ప్రధాన సత్యమై యున్నది.

### ఎందుకు అనేకులు విశ్వసించుటలేదు

అనేకులు యేసు దేవుని కుమారుడని ఆయన యందు విశ్వసించుటలేదు. నాస్తికవాదులు, అజ్ఞేయతా వాదులు, భౌతికవాదులు, మరియు మానవతావాదులు యేసు దైవత్వమును కాదందురు, వీరి వలెనే (యూదా మతము, ఇస్లామ్, హిందూ మతము, మరియు భౌద్ధమతము మొదలైనవి) క్రైస్తవేతర మతములను అభ్యసించువారు కూడా యేసు దైవత్వమును కాదందురు. దీనికి అదనంగా, యేసు ఒక చరిత్ర పురుషుడు అని అనేక మంది పండితులు అంగీకరిస్తారు కానీ వాస్తవముగా యేసు దైవమై యుండెనను అభిప్రాయమును నిరాకరిస్తారు. ఉదాహరణకు స్వయంనియామక ఉదారతవాద పండితులు తమ్మునుతాము

"యేసు సదస్సు" అని పిలుచుకొనుచు చరిత్రలోని "నిజమైన" యేసును కనుగొనవలెనని బయల్దేరారు. వారు (ముందుగా చెప్పుకొనబడునట్లు) యేసు గూర్చి చెప్పుకొనబడగలది ఇతరమైనది ఏదైనా, ఆయన గూర్చి సువార్తలు చెప్పుచున్నవి నిజము కాదను ఒక తుది అభిప్రాయానికి వచ్చారు.

యేసుయందు విశ్వాసముంచుచున్నామని స్వాధికారంతో చెప్పుకొను కొందరు మతసంబంధమైనవారు సహితము వాస్తవంగా ఆయన దైవత్వమును ఒప్పుకొనరు.[1] ఈ క్రింది ఘోషణలు 1960 సంవత్సరములో ఒక వార్తా పత్రికలో ముద్రింపబడినవి:

- లేఖనముల పండితుడైన లెయాండర్ కెక్, వ్యాండర్‌బిల్ట్ విశ్వావిద్యాలయము: "దైవికము"గా నుండుట అనగా ఏమిటో మనకు తెలియకపోవడం కష్టంగా ఉన్నది.
- ఫ్రాన్సిస్కన్ చెందిన సెయింట్ ఫ్రాన్సిస్ సంస్థకు సంబంధించిన వేదాంతశాస్త్ర విభాగ ప్రధానాచార్యుడు, బ్రూక్లిన్‌లోని సెయింట్ ఫ్రాన్సిస్ కళాశాల: "యేసు దైవ్వతమును సంఘము ఎన్నడును స్పష్టము చేయలేదు. ఆయన దేవుడై యున్నాడని యేసు తానే ఎరిగినవాడై యుండలేదని నేను కచ్చితముగా ఎరుగుదును".
- నోట్రే డేమ్ విశ్వావిద్యాలయ వేదాంత శాస్త్రజ్ఞుడు జాన్ డున్నీ: "యేసు ... తన దైవికమైన కుమారత్వము గూర్చి అనిశ్చయమైనవాడై యుండెను, అయినప్పటికిని నిశ్చయత నిమిత్తమైన తన అన్వేషణను ఎన్నడును వదులుకోలేదు[2]."

సువార్తలు బోధించుచున్న సామాన్యమైన ఉపదేశములను ఈ వ్యాఖ్యానాలను చేసిన పండితులు తృణీకరించారని అవి సూచించుచున్నవి.

బైబిలు యొక్క అధికారమును మరియు యథార్థమైన కచ్చితత్వమును అంగీకరించువారు యేసు క్రీస్తు దైవ్వతమును నిరాకరించువారికి వారి అసమ్మతిని బహు బలముగా తెలియజేయవలసినవారై యున్నారు. యేసు క్రీస్తుకు సంబంధించినంత వరకు, లేఖనములు ఈ క్రింది విషయములను రూఢిపర్చుచున్నవి: (1) ఆయన నిత్యత్వము నుండి ఉన్నాడు. ఆయన ఉండెను, ఉన్నాడు, దేవునితో ఏకకాలంలో ఉన్నాడు, దేవుని గుణగణాలు కలిగియున్నాడు, మరియు సమస్త సృష్టియు ఆయన మూలముగా కలిగెను. (2) ఆయన కన్యకకు పుట్టాడు. (3) ఆయన అద్భుతములు చేసాడు. (4) ఆయన దేవుని కుమారుడని స్వాధికారంతో చెప్పాడు, మరియు ఆయన తన కుమారుడని దేవుడు సెలవిచ్చాడు. (5) ఆయన మరణించాడు కానీ మృతులలో నుండి తిరిగి లేపబడినాడు. (6) ఆయన ఆరోహణమయ్యాడు మరియు ఇప్పుడు సజీవుడై యున్నాడు, పరలోకమందు మహిమపర్చబడుచున్నాడు.

**మనమెందుకు నమ్ముచున్నాము**

ఈ ఉపదేశములను మనమెందుకు నమ్ముచున్నాము? యేసు నందు విశ్వసించుటకు మనకు గల హేతువులేమిటి?

*యేసు ఒక విశిష్టమైన జీవితము కొనసాగించాడు.* మొదటిదిగా, ఆయన జీవితము దాని ప్రవచనాత్మక నెరవేర్పులో విశిష్టమైనదై యుండెను. ఉదాహరణకు మెస్సీయా కన్యక గర్భమందు జన్మించును (మత్తయి 1:22, 23; యెషయా 7:14); బేత్లెహేములో జన్మించును

(మత్తయి 2:5, 6; మీకా 5:2); దావీదు వంశములో పుట్టి దావీదు సింహాసనము మీద ఆసీనుడై పరిపాలన చేయును (లూకా 1:32, 33); సిలువవేయబడును (కీర్తనలు 22:16). మొదటిగా, ప్రవచనంలను ఆయన నెరవేర్చాడు, దేవుడు జోక్యము కలుగజేసికొనుటను బట్టియే ఈ ప్రవచనంలలో కొన్ని నెరవేరినవి.[3]

రెండవదిగా, యేసుజీవితం పాపరహిత జీవితములో విశిష్టమైది (హెబ్రీయులకు 4:15). ఆయన జీవితములో ఎవరూ తప్పును చూపలేకపోయారు.

మూడవదిగా, యేసు జీవితము దాని మంచితనములో విశిష్టమైనదై యుండెను. హెన్రీ హెచ్. హేల్లీ ఇలా వ్రాస్తున్నాడు,

> ఒక మానవుడుగా, ఆయన ఎప్పుడైనా తెలిసిన దాని కంటే అత్యంత అద్భుతముగా రమణీయమైన జీవితము జీవించాడు. ఆయన ఎప్పుడైనా జీవించినవారిలో కంటే అత్యంత దయగలవాడును, అత్యంత సున్నితమైనవాడును, అత్యంత మృదువైనవాడును, అత్యంత సహనముగలవాడును, అత్యంత సానుభూతిగలవాడునై యుండెను. ఆయన ప్రజలను ప్రేమించాడు. కష్టములలో నున్నవారిని చూచుటకు కష్టపడేవాడు గనుక కష్టములను ఆయన ద్వేషించాడు. క్షమించు ప్రతిక్రియను ఆయన ఎంతో ప్రేమించాడు. ఇతరులకు సహాయము చేయుటలో ముందుండేవాడు. ఆకలిగొన్నవారికి ఆహారము పెట్టుటకు ఆయన ఆశ్చర్యకరమైన అద్భుతములు చేసాడు. ప్రజల బాధలను తొలిగించుటకు ఆయన తన ఆకలినే మర్చిపోయాడు. జనసమూహములు, అలసిపోయినవారు, బాధల్లో ఉన్నవారు, మరియు హృదయ వేదనగలవారు, ఆయన యొద్దకు వచ్చారు, ఆయన వారిని స్వస్థపరచి పంపాడు గనుక అది వారికెంతో ఆదరణ నిచ్చినది. ఆయన గూర్చి ఒక విషయం చెప్పబడింది, యింకెవరి గూర్చియైనను చెప్పబడలేదు, అదేమనగా ఆయన చేసిన కరుణాసంపన్నమైన కార్యములన్నిటి గూర్చి రచించినట్లుయితే, అట్లు వ్రాయబడిన గ్రంథములకు ఈ భూలోకమైనను చాలదు. యేసు ఇంత గొప్ప వ్యక్తియై యుండెను. దేవుడు ఇటువంటి మూర్తిమంతమై యున్నాడు.[4]

యేసు గుణమును ఎవరు కనిపెట్టగలరు? కనిపెట్టవలెనని ఎవరూ ఆశించియుండరు, ఏలయనగా ఆయన జీవితము మరియు ఉపదేశములు లోకమును ఖండించుచున్నవి. చేయుటకు ఎవరైనా ప్రయత్నించి యుండినను ఈ పని ఎవరునూ చేసియుండరు. యేసు ఎంతో అసాధారణమైన వ్యక్తియై యుండెను, ఊహత్మకమైనవాడై యుండుటకు ఆయన ఎంతో "ఊహలకందని"వాడై యుండెను. ఆయన ఉనికిగలిగినవాడై యుండెను; ఆయన ఎవడైయుండెనని ఆయన స్వాధికారంతో చెప్పాడో తప్పక అదే అయియుండెను.

*యేసు పోల్చబడుటకు సాటిలేని ఉపదేశములను నివేదించారు.* "ఆ మనుష్యుడు మాటలాడినట్లు ఎవడును ఎన్నడును మాటలాడలేదు" అని ఆయన బోధలు విన్నవారిలో కొందరన్నారు (యోహాను 7:45, 46; RSV). ఈ విషయాన్ని శతాబ్దాల తరబడి పరీక్ష చేసి చూచినప్పుడు అది నిజమే అని రుజువయ్యింది. యేసు ఉపదేశములలో మానవ హేతువాదనను మించిన వివేకమున్నది. మనము కూడ, నీకొదేముతో కలిసి, యేసు "దేవుని యొద్ద నుండి వచ్చిన బోధకుడు" అను తుది నిర్ణయమునకు రావలసియున్నది (యోహాను 3:2; RSV).

*యేసు అద్భుతకరమైన విషయాలను స్వాధికారపూర్వకంగా చెప్పుకున్నాడు.* ఆయన దైవమైయున్నాడని ఎన్నడును స్వాధికారంతో చెప్పలేదని కొందరనుచున్నారు; కానీ ఈ క్రింది వాక్యభాగములను మనము చూచినట్లయితే ఆయన చెప్పాడని ఋజువగును:

1. “నేను ఆయనని మీరు విశ్వసించని యెడల మీరు మీ పాపములోనే యుండి చనిపోవుదురు” (యోహాను 8:24బి). “ఆయన” అను మాట లావుపాటి అక్షరములతో వ్రాయబడినది ఎందుకనగా మూల చేతివ్రాత ప్రతులలో ఈ పదము లేదు. ఈ పద బంధమును ఉపయోగించుచూ, ఆయన “నేను ఉన్నవాడని” అని నిర్గమకాండము 3:14లో తనను తాను గుర్తించుకొన్నవాడు ఆయనే అని యేసు స్వాధికారంతో చెప్పుచుండెను.

2. యోహాను 10:28–38లో, ఆయన తనను తాను దేవుడై యున్నాడని చెప్పుట ద్వారా (యోహాను 10:33) ఆయన దేవదూషణ చేయుచున్నాడని యేసు నిందింపబడినాడు, ఆయన దేవుడై యున్నాడని చెప్పిన ఈ ఆరోపణను ఆయన కాదనలేదు, కానీ వాస్తవమునకు అటువంటి మాటలు పలుకుటకు ఆయనకుగల న్యాయసమ్మతమైన తన హక్కును ప్రతిరక్షించుకొనుచుండెను.

3. యోహాను 8:58లో అబ్రాహాము పుట్టకమునుపే ఆయన ఉన్నాడని యేసు చెప్పాడు; ఇటువంటి కచ్చితమైన ఘోషణను నిత్యత్వముగలవాడు మాత్రమే చేయుటకు సమర్థవంతుడని సమర్థించబడును.

4. యేసు పక్షవాయువు గలవానిని స్వస్థపరచినప్పుడు, “కుమారుడా, నీ పాపములు క్షమింపబడి యున్నవి” అని ఆయన చెప్పాడు (మార్కు 2:5). దేవుడొక్కడే తప్ప పాపములు క్షమింపగలవాడెవడని చెప్పుచు యూదీయ నాయకులు ఆయనను విమర్శించారు (మార్కు 2:7). వారు చేసిన నేరారోపణమునకు ప్రతిస్పందిస్తూ, దేవుడు మాత్రమే పాపములను క్షమింపగలడను విషయమును యేసు కాదనలేదు; అయినప్పటికిని, “పాపములు క్షమించుటకు భూమి మీద మనుష్య కుమారునికి అధికారము కలదని మీరు తెలిసికొనవలెను” అని ఆయన నొక్కివక్కాణించాడు (మార్కు 2:10). కాబట్టి, దేవుడు మాత్రమే కలిగియుండు అధికారమును ఆయన కలిగియున్నాడని స్వాధికారముతో చెప్పుచుండెను.

5. “పరమాత్ముని కుమారుడవైన క్రీస్తువు, నీవేనా?” అని ప్రధాన యాజకుడు యేసును ప్రశ్నించినప్పుడు, యేసు “అవును నేనే” అని బదులు చెప్పాడు (మార్కు 14:61, 62). ఆయన పరమాత్ముని కుమారుడై యుండెనని ఒప్పుకొనుట ద్వారా, ఆయన దేవుని కుమారుడైయున్నాడని యేసు ప్రకటించాడు.[5]

ఆయన దైవమైయున్నాడని స్వాధికారముతో చెప్పిన సత్యము అవిశ్వాసిని ఒక సందిగ్ధావస్థలోనికి నెట్టివేస్తుంది. యేసు స్వాధికారముతో చెప్పిన సంగతులన్నిటిని పరిగణ లోనికి తీసికొన్నట్లయితే, యేసు గూర్చి ఈ అవిశ్వాసి యింకేమని చెప్పగలడు?

యేసు సత్యమే చెప్పుచుండెనని అవిశ్వాసి అంగీకరించుటకు సాధ్యమగు మొదటి విషయమై యున్నది. ఏదిఏమైనా, యేసు సత్యమే చెప్పియున్నట్లయితే, ఆయన ఏమైయుండెనని స్వాధికారంతో చెప్పాడో అదే అయియున్నాడు: భూమ్యాకాశములకు దేవుడై యున్నాడు. సరికదా యేసు సత్యమే చెప్పుచుండెనని చెప్పిన తరువాత ఎవరును ఆయనయందు విశ్వసించకుండా ఉండజాలరు.

తర్కబద్ధముగా చూచుకొంటే, యేసు అబద్ధము చెప్పుచుండెననుట సాధ్యమగు రెండవ విషయమై యున్నది. అవిశ్వాసి ఈ విషయానికే అంటిపెట్టుకొని యుండుటకు దాదాపుగా బలవంతము చేయబడుచున్నాడు, ఏది ఏమైనా, యేసు సత్యము చెప్పుచుండలేదు, కానీ బుద్ధిపూర్వకంగా అబద్ధము చెప్పుచుండినట్లుయితే, ఆయన ప్రవర్తన ఆయన

ఉదేశించినవాటన్నిటి ప్రవృత్తిలోను భావాల్లోను విరుద్ధమైనదిగా మరియు ఆయన జీవితము గూర్చి మనకు తెలిసినదానంతటితో మొత్తానికి పొందికలేనిదై యుండును. యేసు ఒక మంచి మనిషైయుండెనా? మనకు తెలిసినదంతా ఆయన మంచివాడై యుండెనని చెప్పుచున్నది. ఆయన అబద్ధము చెప్పియున్ననట్లయితే, ఆయన మంచివాడు కాదు. అలాగైతే ఇటువంటి వింతైన ఒక విపరీతార్థము – ఒక మంచి మనిషి తన గూర్చి తానే అబద్ధము చెప్పుకొనుట – ఎలా పరిష్కరింపబడగలదు?

మూడవ సాధ్యత ఏమనగా యేసు అబద్ధము చెప్పుచుండలేదు కానీ భ్రమచెందినవాడై యుండెను: ఆయన దేవుని కుమారుడైయుండెనని వాస్తవంగా తలంచాడు, కానీ ఆయన దేవుని కుమారుడై యుండలేదు. యేసు గూర్చి మనకు తెలిసినదంతా ఆయన దిట్టమైన వివేకం కలిగియుండెననియు, ఆయన జ్ఞానముగలవాడై యుండెననియు, ఆయన ప్రవర్తన ఆయన ఉపదేశములన్నిటియును వాస్తవముపై ఆధారపడియున్నవనియు సాక్ష్యమిచ్చుచున్నదనునది తప్ప ఈ సాధ్యత అవిశ్వాసికి సంతృప్తినీయవచ్చును. ఆయన ఇతరమైన దేని గూర్చియైనను భ్రమచెందియుండలేదు; వాస్తవానికి ఆయన ఎవరైయుండెనో అను విషయమై ఆయన ఎందుకు భ్రమచెందినవాడై యుండాలి? ప్రాథమికంగా, ఈ మూడవ సాధ్యతను అంగీకరించువారు యేసు వెఱ్ఱెక్కినవాడై యుండెనని చెప్పవలసి యుండును! దీనిని ఎవరు నమ్మగలరు?

యేసు స్వాధికారంతో చెప్పిన సత్యముల దృష్ట్యా, ఆయన ప్రభువుగా, లేదా అబద్ధికుడుగా, లేదా పిచ్చిపట్టినవాడుగా ఎంచబడవలెనని మరో మాటలో చెప్పుకొనవచ్చును![6] అతడు అవిశ్వాసిగానే నిలిచియుండాలని గట్టిగా తీర్మానించుకొనినవాడు ఆయన ఒక అబద్ధికుడై యుండవలెను లేగా ఒక వెఱ్ఱివాడై యుండవలెనని అంగీకరించవలెను! ఈ మూడింటిలో నీవు దేనిని నమ్ముదువు?

*యేసు ఆశ్చర్యకార్యములను చేసాడు.* ఈ కార్యములు పరిశుద్ధ బైబిలులో కచ్చితముగా నివేదింపబడి యున్నవి. యేసు రోగులను స్వస్థపరచాడు, కొన్ని రొట్టెలు మరియు చేపలతో జనసమూహమునకు ఆహారం పెట్టాడు, నీళ్లపై నడిచాడు, దయ్యములను వెళ్లగొట్టాడు, తుఫానులను నిమ్మళింపజేసాడు, నీళ్లను ద్రాక్షారసముగా మార్చాడు, మరియు చనిపోయినవారిని లేపాడని సువార్తలలో గల వివరాలు మనకు తెలియజెప్పుచున్నవి.

యేసు చేసిన అద్భుతకార్యములను ఆయన ఈ లోకంలో జీవించియుండినంత కాలము ఎవరును సందేహించలేదు. ఆయన శత్రువులు సహితము వాటిని కాదనలేకపోయారు; దయ్యములకు అధిపతియైన బయల్జెబూలు వలననే ఆయన అద్భుతములు చేయుచుండెనని మాత్రమే వారు ఆయనను నిందించగలిగారు (మత్తయి 12:24). మృతిచెందిన తరువాత పాతిపెట్టబడి సమాధిలో నాలుగు రోజులుండిన లాజరును యేసు మరలా బ్రతికించాడు! అప్పటికి లాజరు మృతదేహము కుళ్లిపోయి కంపు వాసన కొట్టియుండను (యోహాను 11:39), అట్లయినను లాజరు సమాధిలో నుండి లేచి సజీవుడుగా బయటికి వచ్చాడు! లాజరును చంపివేయుట ద్వారా నిదర్శనము కళ్లకు కానరాకుండా నాశనము చేయుట శక్తిమంతమైన సూచక క్రియ యొక్క ప్రభావముపై ఎదురుదెబ్బ తీయగల ప్రతిచర్యగా చేయుటకు యేసు శత్రువులు ఆలోచించగలిగిన ఒకే ఒక విషయమై యుండినది (యోహాను 12:9–11)! పెంతుకొస్తు దినాన పేతురు ప్రసంగించినప్పుడు, యేసు "అద్భుతములను మహత్కార్యములను మరియు సూచక క్రియలను" చేసాడని అతడు ప్రకటించాడు. అతని ప్రసంగమును

వినుచుండినవారికి ఈ అద్భుతములు గూర్చి తెలియునని అతడు సూటిగా ప్రస్తావించాడు (అపొస్తలుల కార్యములు 2:22) – మరియు పేతురు నొక్కివక్కాణించుచుండిన సత్యము తప్పు అని ఎవరును నిరూపించలేకపోయారు!

యేసు చేసిన అద్భుతములు ఏమని ఋజువుచేయుచున్నవి? ఇందుకు సంబంధించిన సత్యమును యోహాను ముక్తసరిగా వక్కాణించాడు:

> ... మరియు అనేకమైన యితర సూచక క్రియలను యేసు తన శిష్యుల యెదుట చేసెను అవి యీ గ్రంథమందు వ్రాయబడి యుండలేదు గాని యేసు దేవుని కుమారుడైన క్రీస్తు అని మీరు నమ్మునట్లును; నమ్మి ఆయన నామమందు జీవము పొందునట్లును ఇవి వ్రాయబడెను (యోహాను 20:30, 31).

యేసు చేసిన అద్భుతములు ఆయన దేవుని కుమారుడని ఋజువుచేయుచున్నవి!

*యేసు ఇతరులపై ఒక అసమానమైన ప్రభావమును కలిగించుచుండెను.* యేసు ఒక అసాధారణమైనవాడును నిరపరాధియైనవాడునై యుండెనని ఆయనను ఎదుర్కొనిన దాదాపుగా ప్రతి ఒక్కరు అంగీకరించారు. అనేకులు ఆయనను దేవుని కుమారుడుగా గుర్తించారు. యేసు “లోక పాపమును మోసికొనిపోవు దేవుని గొఱ్ఱెపిల్లయై యున్నాడని” బాప్తిస్మమిచ్చు యోహాను ప్రస్తావించాడు (యోహాను 1:29). “ఆయన దేవుని కుమారుడనియు ఇశ్రాయేలు రాజనియు” నతనయేలు బాహాటంగా చాటి చెప్పాడు (యోహాను 1:49). యేసు “సజీవుడగు దేవుని కుమారుడైన క్రీస్తు” అని పేతురు ఆయనను అంగీకరించాడు (మత్తయి 16:16). ఆయన “దేవుని కుమారుడని” దయ్యములు గుర్తించినవి (మత్తయి 8:29). ఆయన సిలువ మీద మరణించినప్పుడు, సిలువ సమీపమున నుండిన ఒక శతాధిపతి, “నిజముగా ఈయన దేవుని కుమారుడు!” అని ఆశ్చర్యముతో యేసును వర్ణించాడు (మత్తయి 27:54). “ఈయన ఇతరులను రక్షించెను” అని యేసు సిలువపై మరణించుచుండినప్పుడు ఆయనను ఎగతాళి చేసిన శత్రువులు సహితము అంగీకరించారు (మత్తయి 27:42).

యేసు వ్యక్తిగత జీవితముల స్వరూపాన్నే మార్చివేయు ప్రభావముగలవాడై యుండెను. ఉదాహరణకు క్రైస్తవులను తీవ్రముగా పరివేధించుచుండిన సౌలును ఆయన తన సందేశమునే ప్రకటించు సౌలుగా మార్చివేసాడు; ఆయన “ఉరిమెడువాడైయుండిన” యోహానును (మార్కు 3:17 చూడుము) ప్రేమను చాటిచెప్పు అపొస్తలునిగా మార్చివేసాడు (1 యోహాను 4 చూడుము); మరియు పేతురును, యేసును ఎరుగనని ముమ్మారు బొంకినవానిని, విశ్వాస విషయములో మరణించుటకైనను సంసిద్ధుడై యుండగల సమర్థవంతునిగా తీర్చిదిద్దాడు (యోహాను 21:19 చూడుము)![7] మార్పుచేయబడిన అపొస్తలుల జీవితములు – పిరికితనముగల శిష్యులై యుండినవారిని వారి ప్రభువు నిమిత్తము మరణించుటకైనను మనఃపూర్వకంగా ఇష్టపడుచుండిన నాయకులుగా మార్చబడిన జీవితములు – క్రీస్తు యొక్క దైవత్వమునకు అత్యంత బలమైన తర్కములలో ఒకటై యున్నది.

*యేసు ప్రభావము నేడు కూడా కొనసాగుచునే యున్నది.* యేసు యొక్క గొప్ప ప్రభావమును ఒకరు ఉదాహరణంగా ఇలా వర్ణించారు:

> హెన్రీ రాజర్స్, సూక్ష్మబుద్ధిగల న్యాయవాది, క్రీస్తు ప్రభావము నేటి మన నాగరకతలో నిలిచియుండకుండా కొన్ని శక్తిమంతమైన హస్తాలు తుడుపుపెట్టినవని ఊహించుకొంటూ

> ఆయన కొన్ని సంవత్సరాల క్రితం *The Eclipse of Faith* అను ఒక పుస్తకం రచించాడు. మానవుని గౌరవమును సమర్థించగల శాసనమేదైనా కలదేమో అని న్యాయశాస్త్ర గ్రంథములను పరిశీలనగా తరచిచూసాడు కానీ ఆయనకు ఏదియును కనబడలేదు; పిల్లలు, బీదలు, మరియు నిరపరాధుల హక్కులను కాపాడు చట్టములు అదృశ్యమయ్యాయి. సాహిత్యములో ఇదివరకు డాంటే, మిల్టన్, బ్రౌనింగ్ మరియు టేన్నిసన్ యొక్క రచనలు అగుపించిన పుటలు ఇప్పుడు ఆయనకు ఖాళీగా మాత్రమే కనిపించాయి. వైద్యశాలలు మరియు అనాథశరణాలయాలు మాయమైపోయాయి. రచయిత ఇలా విలపిస్తున్నాడు; "క్రీస్తు రాని లోకములో జీవించాలని నేను కోరుట లేదు."[8]

*యేసు పునరుత్థానుడయ్యాడు.* చరిత్రలో అత్యంత ప్రాముఖ్యమైన వాస్తవమేమనగా, ఆయన మరణించి పాతిపెట్టబడిన తరువాత మూడవ దినమున, యేసు మృతులలో నుండి లేపబడినాడు. ఆయనను పాతిపెట్టిన సమాధి ఖాళీగా ఉండినది! ఇదెలా సాధ్యమౌతుంది?

1. యేసు శత్రువులు ఆయన దేహమును అపహరించారా? లేదు. అలా చేయుటకు వారికి కారణమేమియు లేదు. ఒకవేళ వారు అలా చేయాలని ఆశించియుండినట్లయితే, అలా చేయకుండా సమాధిని భద్రము చేయుటకు కావలి యుండిన కాపలాదారులు వారిని నిరోధించేవారే. ఒకవేళ యేసు శత్రువులే ఆయన దేహమును అపహరించియుండినట్లయితే, యేసు పునరుత్థానమును శిష్యులు ప్రకటించుచుండినప్పుడు వారు ఆ దేహమును ప్రజలముందుంచేవారే. ఇలా జరిగియుండిన యెడల క్రైస్తవ్యము ప్రారంభం కాకమునుపే అది వ్యాప్తిచెందకుండా ఆపుజేయబడియుండేది.

2. యేసు స్నేహితులు ఆయన దేహమును దొంగిలించారా? లేదు. మరొక పర్యాయము, వారు అలా చేయుటకు అవకాశమే లేదు, అంతేగాక వారు సమాధిని సమీపింపక మునుపే కాపలాదారులు వారిని నిరోధించి యుందురు. ఒకవేళ వారి యొద్ద మృత దేహము ఉండినట్లయితే, వారొక అబద్ధమును ప్రబోధించుచుండిన వారగుదురు. వాస్తవమై యుండిన యేసు పునరుత్థానమును అపొస్తలులు ప్రకటించినంత నమ్మశక్యముగాను ఒప్పింపుగాను ఒక అబద్ధమును మనుష్యులు ప్రకటించలేరు. అబద్ధమని తెలిసిన విషయం కోసం ఎవరును వారి ప్రాణాలనర్పించరు. పునరుత్థానములో వారికుండిన విశ్వాసమునుబట్టియే అపొస్తలులు అందునిమిత్తము వారి ప్రాణాలనర్పించారు.

3. యేసు మృతులలో నుండి లేపబడినాడని అపొస్తలులు సామాన్యంగా ఊహించుకొన్నారా? వారు ఆయనను సజీవునిగా చూసారని ఆలోచించుచు ఎట్టకేకలకు ఆయన మృతులలో నుండి లేపబడినాడని నమ్మునంతగా వారు ఆయన పునరుత్థానమును విశ్వసించవలెనని ఆశించారా? లేదు. ఆయన లేపబడునట్లు వారు ఎదురుచూడవలసి యుండినది, కానీ వారు ఎదురుచూడలేదు. వాస్తవమునకు, విశ్వసించుటకు వారు మందమతులై యుండిరి. సరికదా వారు మానసిక విభ్రాంతులకు గురయ్యేటటువంటి మనుష్యులు కాదు. ఆయన నిజముగా మృతులలో నుండి లేచాడనియు, ఆయన శరీరము మరలా సజీవమైనదనియు యేసు నిదర్శనాత్మకంగా ప్రదర్శించాడు.

యేసు దేహము పాతిపెట్టబడిన సమాధి ఖాళీగా ఉండినదనుటకు ఒకే ఒక వివరణ సహేతుకమైనదై యున్నది: యేసు మృతులలో నుండి లేపబడియుండెను! ఆయన పునరుత్థానము ఆయన దైవత్వమునకు రుజువై యున్నది. యేసు క్రీస్తు "మృతులలో నుండి

పునరుత్థానుడైనందున పరిశుద్ధమైన ఆత్మనుబట్టి దేవుని కుమారుడుగాను ప్రభావముతో నిరూపింపబడెను" అని పౌలు రచించాడు (రోమీయులకు 1:4).

*యేసు దేవునిచేత ఆమోద ముద్రవేయబడెను.* యేసు ఆయన కుమారుడైయున్నాడని ధృవపర్చుటకు దేవుడు పరలోకము నుండి రెండు సందర్భములలో మాటలాడాడు (మత్తయి 3:17; 17:5; యోహాను 12:27, 28 కూడ చూడుము). యేసు ఆయన కుమారుడై యున్నాడని దేవుడు అంగీకరించుట విషయమంతటిని పరిష్కరించుచున్నది.

ఈ కారణములన్నిటినిబట్టి, యేసు క్రీస్తు, వాస్తవముగా, దేవుని కుమారుడై యుండెనని మనము విశ్వసించవచ్చును. ఆయన దైవికమైనవాడై యుండెను, మరియు దైవికమైనవాడై యున్నాడు; ఆయన దైవమై యుండెను, దైవమై యున్నాడు!

## ప్రజల్లో ఉండాల్సిన అత్యంత భావగర్భితమైన విశ్వాసము

మానవులు నమ్మటానికే పుట్టారు, గనుక వారు ఏదో ఒక దాని మీద నమ్మకముంచుదురు. దేవుని యందు లేక ఒక దేవత యందు నమ్మకముంచకుండుటకు ఎన్నుకొనువారు మరొక దానిలో నమ్మకముంచుదురు. బహుశా వారు విజ్ఞానశాస్త్రమునకు తల వంచి నమస్కరింపవచ్చును లేదా ఈ విశాల విశ్వమంతటిలో మానవుడే అత్యున్నతమైన శక్తి యని వాని యందు విశ్వసించవచ్చును. ఏదిఏమైనా, యేసు దేవుని కుమారుడైయున్నాడని ఆయన యందు ఉంచబడు విశ్వాసము సకల విశ్వాసములలోను అత్యంత ప్రాముఖ్యమైన భావముతో కూడినదై యున్నది. యేసును గూర్చి మనము నమ్మవలెనని చేసికొను తీర్మానము మనము ఈ లోకములో ఎలా జీవిస్తామను విషయమును మాత్రమే కాదు, కానీ ఇక మీదట మనము జీవించియుందుమా లేక మరణించియుందుమా అను విషయమును కూడా నిశ్చయము చేయును! యేసు క్రీస్తు దేవుని కుమారుడై యున్నాడని విశ్వసించవలెనను నిరపేక్షమైన ఆవశ్యకతను బైబిలు బోధించుచున్నది:

> "నేను ఆయనని మీరు విశ్వసించని యెడల మీరు మీ పాపములోనే యుండి చనిపోవుదురు ..." అని యేసు చెప్పెను (యోహాను 8:24).
>
> "దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను, కాగా ఆయన తన అద్వితీయకుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక, నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను" (యోహాను 3:16).
>
> "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును; నమ్మని వానికి శిక్ష విధింపబడును" (మార్కు 16:16).
>
> తన్ను [యేసును] ఎందరంగీకరించిరో వారికందరికి, అనగా తన నామమునందు విశ్వాసముంచిన వారికి, దేవుని పిల్లలగుటకు ఆయన అధికారము అనుగ్రహించెను (యోహాను 1:12).
>
> "ప్రభువైన యేసునందు విశ్వాసముంచుము, అప్పుడు నీవును నీ యింటివారును రక్షణ పొందుదురు" అని పౌలు మరియు సీల చెప్పారు (అపొస్తలుల కార్యములు 16:31).

నీవు అంగీకరించగల అభిప్రాయములన్నిటిలో, యేసు ఏమైయున్నాడని బైబిలు ఉపదేశించుచున్నదో ఆయన అదే అయియున్నాడనునది నీవు ఇప్పుడు మరియు నిరంతరము

రక్షింపబడునట్లు నమ్మవలసిన ఒక సత్యమై యున్నది. యేసు క్రీస్తు – బేత్లెహేములో జన్మించినవాడు, నజరేతులో ఎదిగినవాడు, యెరూషలేములో ఒక సిలువపై మరణించినవాడు– దైవికమైన దేవుని కుమారుడై యుండెను, అయియున్నాడు!

### ప్రజలు ఒప్పుకొనవలసిన అత్యంత కీలకమైన అంశము

మనము యేసునందు మన హృదయములో విశ్వసించుట మాత్రమే కాదు కానీ విశ్వాసించుచున్నామని మన నోటితో ఒప్పుకొనుటకు కూడ ఇష్టపడుచున్నవారమై యుండవలెను. పౌలు ఇలా వ్రాయుచున్నాడు,

> … యేసు ప్రభువని నీ నోటితో ఒప్పుకొని, దేవుడు మృతులలో నుండి ఆయనను లేపెనని నీ హృదయమందు విశ్వాసించిన యెడల నీవు రక్షింపబడుదువు; ఏలయనగా నీతి కలుగునట్లు మనుష్యుడు హృదయములో విశ్వసించును, రక్షణ కలుగునట్లు నోటితో ఒప్పుకొనును (రోమీయులకు 10:9, 10).

మనము రక్షింపబడగోరుచున్నట్లయితే పేతురు చేసిన ఒప్పుకోలు మనము కూడ ఒప్పుకొనుటకు ఇష్టపడవలసిన ఒక ఒప్పుకోలై యున్నది! బహుశా, యేసు దేవుని కుమారుడై యున్నాడని ఒప్పుకోలు తిమోతి రక్షింపబడినప్పుడు అతడుచేసిన "మంచి ఒప్పుకోలు" అయియున్నది (1 తిమోతి 6:12). "యేసు దేవుని కుమారుడని యెవడు ఒప్పుకొనునో, వానిలో దేవుడు నిలిచియున్నాడు, వాడు దేవునియందుయున్నాడు" అని అపొస్తలుడైన యోహాను రచించాడు (1 యోహాను 4:15).

యేసు దేవుని కుమారుడై యున్నాడని నీవు ఆయనయందు విశ్వసించి కూడా, నీ విశ్వాసమును నీమట్టుకే ఉంచుకొని దాని గూర్చి ఇతరులెవరికిని తెలియజెప్పనట్లయితే, నీ విశ్వాసము సాధించినదేదియును ఉండదు. "మనుష్యుల యెదుట నన్ను ఒప్పుకొనువాడెవడో, పరలోకమందున్న నా తండ్రి యెదుట నేనును వానిని ఒప్పుకొందును. మనుష్యుల యెదుట ఎవడు నన్ను ఎరుగననునో, వానిని పరలోకమందున్న నా తండ్రి యెదుట నేనును ఎరుగనందును" అని యేసు చెప్పాడు (మత్తయి 10:32, 33).[9]

ఇహమందు యేసును ఒప్పుకొనుటకు నిరాకరించువారు ఒక రోజున ఒప్పుకొంటారు! క్రీస్తు తిరిగి వచ్చినప్పుడు, "అందుచేతను పరలోకమందున్న వారిలో గాని, భూమిమీద ఉన్న వారిలో గాని, భూమి క్రింద ఉన్న వారిలో గాని, ప్రతివాని మోకాలును యేసునామమున వంగునట్లును, ప్రతివాని నాలుకయు తండ్రియైన దేవుని మహిమార్థమై యేసుక్రీస్తు ప్రభువని ఒప్పుకొనునట్లును, దేవుడు ఆయనను అధికముగా హెచ్చించి, ప్రతి నామమునకు పైనామమును ఆయనకు అనుగ్రహించెను" (ఫిలిప్పీయులకు 2:9–11) – కానీ వేచియుండువారి విషయంలో, ఆ చివరి మహా దినాన ఒప్పుకొనుట వలన రక్షణ కలుగదు!

### ముగింపు

"నీవు సజీవుడగు దేవుని కుమారుడవైన క్రీస్తువు" అని పేతురు యేసుతో అన్నాడు. అతడు మనము అంగీకరించవలసిన ఒక వాస్తవమును, మనము ఆర్జించవలసిన ఒక విశ్వాసమును, మరియు మనము ఆమోదించవలసిన ఒక ఒప్పుకోలును చాటిచెప్పుచుండెను,

మనకు "పేతురు యేసు గూర్చి ఏమని తలంచాడు?" అన్నది ప్రశ్న కాదు. యేసు చెప్పినట్లు, "క్రీస్తుని గూర్చి నీకు ఏమని తోచుచున్నది? ఆయన ఎవని కుమారుడు?" అనునదే అసలు ప్రశ్నయై యున్నది (మత్తయి 22:42). యేసు దేవుని కుమారుడై యుండెనని, మరియు అయి యున్నాడని, పేతురు విశ్వసించినట్లే, నీవు కుడా విశ్వసించుచున్నావా? అలాగైతే, నీవు మంచి పనే చేయుచున్నావు. యేసు దేవుని కుమారుడై యున్నాడని ఒప్పుకొనుటకు నీవు ఇష్టపడుచున్నావా? అలాగైతే, అది యింకా శ్రేష్ఠమైనదై యున్నది. ఏదిఏమైనా, ఇది సరిపోదు. క్రీస్తునందలి విశ్వాసమును ఒప్పుకొనుటకు కేవలము ఇష్టపడుట చాలదు.

నీ విశ్వాసము నీవు దేవునికి లోబడునట్లు నిన్ను నడిపించవలెను. "ప్రభువా, ప్రభువా, అని నన్ను పిలుచు ప్రతివాడును, పరలోక రాజ్యములో ప్రవేశింపడు, గాని పరలోకమందున్న నా తండ్రి చిత్తప్రకారము చేయువాడే ప్రవేశించును" అని యేసు చెప్పెను (మత్తయి 7:21). నీకు దేవుని కుమారునియందు గల విశ్వాసము నీవు నీ పాపముల గూర్చి పశ్చాత్తాపపడునట్లును (లూకా 13:3), నీ విశ్వాసమును మనుష్యుల యెదుట ఒప్పుకొనునట్లును (రోమీయులకు 10:10), నీవు క్రీస్తులోనికి పాపక్షమాపణ కొరకైన బాప్తిస్మము (మార్కు 16:16; అపొస్తలుల కార్యములు 2:38) పొందునట్లును నిన్ను నడిపించునుగాక. నీవు సువార్తకు లోబడినప్పుడు, నీవు రక్షణాశీర్వాదములోను నిత్యజీవ నిరీక్షణలోనుగల ఆనందానుభూతిని అనుభవించుదువు.

---

సూచనలు

[1]ఈ ఘోషణ నామకార్థముగా "క్రైస్తవులు" అయియుందురు కానీ యేసు దైవత్వమును గూర్చిన ప్రాముఖ్యమైన సత్యములను ఒప్పుకొనని కొన్ని శాఖల విషయంలో సత్యమైయుండును. [2]"Easter 1966 - A Quest for the True Jesus," *Newsweek* 67 (11 April 1966): 72. [3]ఉదా॥ ఆయన ఎక్కడ జన్మించాలో లేక ఎలా మరణించాలో యేసు ఎంపికచేసికొనలేకపోయాడు. [4]Henry H. Halley, *Halley's Bible Handbook,* 24th ed. (Grand Rapids, Mich.: Zondervan Publishing House, 1965), 20. [5]వాస్తవముగా, ఆయన దేవుని కూమారుడై యుండెనని స్వాధికారంతో చెప్పుటనుబట్టియే యేసు సిలువవేయబడినాడు. "మాకొక నియమము కలదు, తాను దేవుని కుమారుడనని ఇతడు చెప్పుకొనెను గనుక ఆ నియమము చొప్పున ఇతడు చావవలెను" అని యూదీయ నాయకులు పిలాతుతో చెప్పారు (యోహాను 19:7). [6]ఇవి Josh McDowell రచించిన *More Than a Carpenter* (Wheaton, Ill.: Tyndale House Publishers, 2004), 22-31లో ఇవ్వబడిన విధివిహితంకాని ఎంపికలై యున్నవి; ఇదే విధమైన తర్కవాదము C. S. Lewis రచించిన *Mere Christianity* (New York: Macmillan Co., 1952), 55-56లో నివేదింపబడి యున్నది. [7]పేతురు రోమా పట్టణములో ఒక హతసాక్షిగా మరణించాడని సాంప్రదాయము చెప్పుచున్నది. ఈ సాంప్రదాయమును సందేహించుటకు ఎటువంటి హేతువైనను లేదు. [8]Church bulletin, 29th and Yale Church of Christ, Tulsa, Oklahoma, 24 December 1964. [9]క్రీస్తును ఒప్పుకొనుటకు ఇష్టపడనివారి ఉదాహరణము కొరకు, యోహాను 12:42, 43 చూడుము.